# మరణం ధ్రువం

పుట్టినవాడు గిట్టక తప్పదు. మరణం అనేది ప్రతి వ్యక్తీ తప్పక ఎదుర్కోవలసిన సంఘటన. అయితే ప్రతి వ్యక్తీ ఎన్ని సంవత్సరాలు బ్రతుకుతాడు? అతని ఆయుర్దాయం అతనికి తెలుస్తుందా?

శ్రీరామమూర్తిగారు పరమ నైష్ఠికుడు. త్రిసంధ్యలు వార్చకుండా ఆయనకు రోజు గడవదు. క్షణం క్షణం రామనామస్మరణ.

ఆయనకు నలుగురు కొడుకులు, నలుగురు కుమార్తెలు. ఆ రోజుల్లో కుటుంబ నియంత్రణ అమలులోలేదు. అందరికీ వివాహాలు చేసి బాధ్యతలు వదిలించుకున్నారు. అందువలన ఆయన నిశ్చింతగా వున్నారు. కష్టార్జితంతో కట్టుకున్న స్వంత ఇంట్లో వుంటూ, పెద్దలు సంపాదించి పెట్టిన భూమిని సాగుచేయించుకుంటున్నారు. మూడు వాటాలు అద్దెకు ఇచ్చి, తాము ఒక వాటాలో వుంటున్నారు.



కథా నిలయం
శ్రీకాకుళం

భార్య రామలక్ష్మమ్మ. ఆయనకు తగిన భార్య. ముమ్మూర్తులా లక్ష్మీదేవి. దానధర్మాలు తెలిసిన అన్నపూర్ణ. భర్తకు ఏ సమయంలో ఏది కావాలో సమకూర్చి, ఆయనతో పాటుగా భగవంతుని స్మరించడం ఆమె విధి.

తీరికగా వున్నప్పుడు కొడుకులు, కోడళ్ల గురించి, కూతుళ్లు, అల్లుళ్ల గురించీ ఆలోచించు కొని సంబరపడుతుంటారు ఆ దంపతులు. ప్రతి వేసవిలోనూ పిల్లల శెలవులకు కొడుకులు, కూతుళ్లూ శ్రీరామమూర్తి ఇంటికే రావాలి. అది ఆయన కోరిక. కోడళ్లను కూడా కూతుళ్లతో సమానంగా చూసే సమదృష్టిగలవారాయన.

“ఏమోయ్ శెలవులు ఇంకా ఎన్ని రోజులకు మొదలవుతాయంటావ్?” రాత్రి భోజనం చేసిన తరువాత వక్కపొడి నములుతూ, కాళ్ల దగ్గర కూర్చున్న లక్ష్మమ్మగారిని అడిగేరు.

“భలేవారండీ ఈరోజేగదా ఉత్తరాలు వచ్చాయి అందరి దగ్గరనుండి. శెలవులకు వస్తామని. ఇంక రెండు రోజులుంది.”

“పాలవాడికి, పెరుగువాడికి, నెయ్యివాడికీ చెప్పు ఎక్కువలు కావాలని. పిల్లలు అందరూ వస్తారు కదా. ఏమైనా తినడానికి చెయ్యి. రేపు బజారుకు వెళ్లి బిస్కట్లు తీసుకువస్తాను” అన్నారు శ్రీరామమూర్తిగారు.

“మీరేమీ హైరాన పడకండి. నేను అన్నీ చూసుకుంటాను.”

వరండాలో మడత మంచంమీద పడుకున్న ఆయనకు లక్ష్మమ్మగారు కాళ్లు పడుతూంటే నిదురపోయారు.

* * *

సూర్యభగవానుడు మామూలుగా తన దివ్య కిరణాలతో ఈ లోకాన్ని వెలుగుతో నింపుతున్నాడు. అది మే నెల కావడం వలన, రోహిణీ కార్తె కావటం మూలాన్న ఉదయం ఆరున్నర గంటలకే సూర్యకిరణాలు చురుక్కుమంటున్నాయి.

శ్రీరామమూర్తిగారు అనుష్టానం చేసుకుని పడకకుర్చీలో కూర్చుని కాఫీ సేవిస్తున్నారు.

రాత్రి వచ్చిన కల సూర్యకిరణాల వేడి కన్న మిన్నగా ఆయన మనస్సును దహించివేస్తోంది.

అయితే ఇది జరుగుతుందంటావా శ్రీరామా! నన్ను నీ దగ్గరకు జేర్చుకుంటున్నావా? నీ సన్నిధిలో కూర్చుని రామనామస్మరణ చేసుకుంటూ, రామదాసు కీర్తనలు మనసారా పాడుకుంటాను స్వామీ... నన్ను కరుణించు స్వామీ...

అయితే లక్ష్మిని ఎవరు చూస్తారు?... అదిగో మనస్సు వశం తప్పుతోంది. పెద్ద కొడుకు మంచివాడు. కోడలు కూడా చాలా మంచిది. ఈ ఆలోచన వచ్చేక మనసుకు ఊరట కలిగింది.

“లక్ష్మి...”

“ఏమిటీ... హడావిడి ప్రొద్దున్నే” అంటూ కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

“కూర్చో నీతో మాట్లాడాలి.”

“వంటయితే పెందళాడే భోజనం చెయ్యొచ్చు. మీకు అసలే నీరసం. తరువాత మాట్లాడుకోవచ్చులెండి.

“లక్ష్మి నేను లేకుండా బ్రతుకగలవోయ్”

“చాల్లెండి చోద్యం. ప్రొద్దున్నే ఈ ఆలోచనలు ఎందుకు మీకు?”

కె.బి. కృష్ణ
పాత బంగారం

"రాత్రి నాకు కలవచ్చింది. హనుమజ్జయం తినాడు సాయంకాలం ఆరుగంటలకు నేను దైవసన్నిధికి చేరుకున్నట్లుగా. శ్రీరామచంద్ర మూర్తి తయారుగా ఉండమన్నాడే..." పచ్చివెల క్కాయతింటే గొంతులో పట్టివేసినట్లు, ముద్ద దిగకుండా బాధపడుతున్నట్లు ఆయన గొంతు గాద్గదికమైంది.

తన భర్తకు వచ్చినది కలే అయినా అగ్ని పర్వతం పగిలి తనవైపుకు అతి వేగంగా లావా వస్తున్నట్లుగా గజగజ వణికిపోతోంది లక్ష్మమ్మ.

ఒకవేళ నిజమైతే.....

అమ్మో! ఆయన లేకుండా నేను వుండలేను.

"పిచ్చిగానీ... కలలు ఎక్కడైనా నిజం అవు తాయా?" ఇన్ని ఆలోచనలతో కన్నీటి తెరలలో శూన్యాన్ని చూస్తోందామె.

"పిచ్చి లక్ష్మీ బాధపడకు. గీతలో చెప్పినట్లు మృత్యువు అనేది చిరిగిన పాతవస్త్రం తీసి క్రొత్త వస్త్రం ధరించినట్లే. శాశ్వతంకాని జీవితం కోసం తాపత్రయం అవివేకం" అని సముదాయి స్తున్నారామెను.

ఆయన మనస్సులో లోతు తెలియని దిగు లు. కొడుకులు, మనుమలు, కోడళ్లు, కూతు ళ్లు, అల్లుళ్లు, మనమరాళ్లు, ఆత్మీయులు, స్నేహి తులు వీళ్లందర్నీ వదిలి ఈ ఆత్మ పయనించాలి పైకి - పైపైకి. ఈ లోకం శాశ్వతం కాదు. ఈ భవబంధాలు వెట్టిప్రేమలు. ఇవన్నీ మన స్సును కట్టిపడేసి ఒక్కోసారి భగవంతుని స్మరిం చడానికి కూడా అవకాశం ఇవ్వవు.

అయితే ఇవన్నీ జీవితానికి అవసరంలేదా? అవసరమే. మానవజన్మ ఎత్తేక కొన్ని ధర్మ ఆచరించాలి. షేక్స్పియర్ "As You Like It" లో చెప్పినట్లు మనిషికి ఏడుదశలు - బాల్యం,

## పాతబంగారం

కాకరపర్తి భగవాన్ కృష్ణ గారు 'కె.బి. కృష్ణ' గా తెలుగు పాఠకులకు చిరపరిచితులు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక, ప్రణాళికా శాఖలో డివిజనల్ అక్కౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన వీరు 450 కి పైగా కథలు, మినీ కథలూ రచించారు. పన్నెండు నవలలు రచించడమే కాక కొన్ని కవితలు కూడా వ్రాసారు. వీరి కథలు కొన్ని కన్నడం, హిందీ భాషల్లోకి సైతం అనువదిం చబడ్డాయి.

*1979* లో రచనా వ్యాసంగం ప్రారంభించిన శ్రీ కె.బి. కృష్ణ తన రచనలకు అనేక బహుమ తులు, అవార్డులు, సత్కారాలూ అందుకొన్నారు.

'పాఠకుల మదిలో కలకాలం నిలిచే మంచి రచనలు అందించాలనేదే తన ఆశయమని చెప్పే శ్రీ కృష్ణ లయన్స్ క్లబ్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా పాలుపంచుకొంటున్నారు.

*1983* లో 'ఆంధ్రపత్రిక' ఉగాది సంచికలో 'మరణం ధృవం' అనే ఈ కథ ప్రచురించబడింది. అన్యోన్య దాంపత్యం కలబోసి ఉన్న ఒక కుటుం బంలో అకస్మాత్తుగా రేగిన ఒక కలకలం చివరికి ఏ విధమైన పరిణామానికి దారితీసిందో పాఠకుల హృదయాలను హత్తుకొనేలా ఈ కథలో చిత్రీకరిం చడం జరిగింది. నేటితరం పాఠకుల కోసం ఈ కథను పునర్ముద్రిస్తున్నాం.

విద్యార్థి దశ, ప్రేమికుడు, వీరుడు, న్యాయనిర్ణేత, వృద్ధుడు, మరణం ఆసన్నమైనవాడు. అందుకని తను చివరి దశలో వున్నాడు. మరణం సమీ పిస్తున్నదని బాధపడటం అవివేకం.

ఎదురింటి వారి అబ్బాయిని పిలిపించి తన ప్లీడరును వెంటనే రమ్మని కబురు చేశారు. ఎదురింటి శేషాద్రిగారు వచ్చారు.

"ఏమిటి మూర్తిగారూ ప్లీడరు కోసం కబురు చేశారుట. ఏమయింది?"

రాత్రి తనకు వచ్చిన కల వివరం చెప్పారు మూర్తిగారు.

పగలబడి నవ్వేరు ఆయన. "శేషాద్రిగారూ నవ్వకండి, ఇది నిజం అవుతుందని నాకు ఎందుకో గట్టి నమ్మకంగా వుంది" అన్నారు మూర్తిగారు.

ప్లీడరుగారు వచ్చారు. ఇల్లు నాలుగు వాటాలూ నలుగురు కొడుకులకు, ఎనిమిది ఎకరాల పొలం నలుగురు కొడుకులకు, నలుగురు కూతుళ్లకూ సమానంగా వ్రాశారు. ఈ తతంగమంతా కన్నీటి తెరలలో గమనిస్తోంది లక్ష్మమ్మగారు.

"లక్ష్మమ్మగారూ విచారించకండి. ఈ పని ఎప్పుడైనా చేయవలసిందే. ఏమీ జరగదు. అయితే శ్రీరామమూర్తిగారు మాత్రం చాలా దూరదృష్టితో ఈ పని చేశారు. అనుకోకుండా ఇంటి యజమాని చనిపోతే అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లూ, స్థిరచరాస్తుల కోసం తగవులాడుకొని చితికిపోయిన సంసారాలు నాకు ఎన్నో తెలుసు" అని శేషాద్రిగారు ఇద్దర్నీ సముదాయించారు.

* * *

కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లూ వస్తారనుకున్న రోజు వచ్చింది.

పెద్ద కొడుక్కి నలుగురు సంతానం. రెండవ కొడుక్కి ముగ్గురు పిల్లలు. మూడవ కొడుక్కి ఇద్దరే పిల్లలు. నాలుగవ కొడుక్కి ఇంకా సంతానంలేదు. నలుగురు అమ్మాయిలకూ కలిపి పదిమంది సంతానం.

ఒక రోజు అటూఇటూగా అందరూ రావటంతో ఇల్లంతా నిండిపోయి పెళ్లివారి ఇల్లులా వుంది.

అందరూవచ్చేక లక్ష్మమ్మగారు ఏడుస్తూ విషయం చెప్పింది. అందరూ ఒకేసారి గొల్లుమన్నారు. ఏం జరిగిందోనని శ్రీరామమూర్తి గారు లోపలకు వచ్చారు. అందరూ ఆయన్ని చుట్టు ముట్టేరు.

"నాన్నగారూ! మీకు ఏం జరగదు. మీరు ఎప్పుడూ ఆరాధించే శ్రీరామచంద్రమూర్తి మాకు అన్యాయం చెయ్యడు" అన్నారు కొడుకులు, కూతుళ్లు.

"మీరందరూ కంగారు పడకండి. భగవంతుడు నాకు సమయం దగ్గరైందని హెచ్చరించాడు. అయితే ఒక్క విషయం వినండి. మీ అమ్మను మాత్రం జాగ్రత్తగా చూసుకోండి. అమ్మ పెద్దాడి దగ్గర వుంటుంది. ఎటువంటి ప్రలోభాలకూ లొంగకండి. ఆస్తి అందరికీ సమానంగా విల్లు వ్రాశాను. సంతోషంగా అందరూ ఇలాగే ప్రతి వేసవి శెలవులకూ కలుసుకోండి. నేను పైనుండి ఆనందంతో చూస్తాను" అని ఆయన అనగానే, నలుగురు కొడుకులూ ఆయన్ని మాట్లాడనియ్యకుండా ఆపేశారు. బయట వరండాలో కూర్చున్నారు. లోపల లక్ష్మమ్మగారి మాటలు, కోడళ్లు, కూతుళ్ల మాటలూ పిల్లల పేచీలు... చిన్న సంతలా వుందా ఇల్లు.

రోజులు చాలా భారంగా గడుస్తున్నాయి. ఒక రోజు శివాలయంలో రుద్రాభిషేకం, ఇంకో రోజు నవగ్రహాల జపం. రోజూ ఆ ఇంటి పురోహితునిచే మృత్యుంజయ స్తోత్రపారాయణం.

ఆ రోజు వచ్చింది. అందరికీ దిగులు. పిల్లలంతా మామూలుగా ఆడుకుంటున్నారు.

మూర్తిగారు ఆ రోజు ఉదయమే లేచి పూజా కార్యక్రమాలు, చేసుకున్నారు. తనకు ఇష్టమైన వంటకాలు చేయించుకుని భుజించి, విశ్రమించారు.

మధ్యాహ్నం నిద్రలేచి త్వరగా వంట చెయ్యమన్నారు. ఎప్పుడూ రాత్రి తొమ్మిదికిగానీ భోజనం చెయ్యని ఈయన సంగతి ఏమిటని అనుకుంటూ ఆమె వంట చేసింది.

బయట వరండాలో అందరినీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని కూర్చున్నారు శ్రీరామమూర్తిగారు. శేషాద్రిగారు కూడా వచ్చేరు.

అందరికీ ఒక ప్రక్క ఇది జరగదులే అని అనుకున్నా వారి మనసుల్లో దుఃఖం గూడు కట్టుకునివుంది.

"శేషాద్రీ.... ఒకవేళ నేను చనిపోయినా ఏంగొడవలు జరగకుండా పిల్లలను"... ఆయన నోటికి చెయ్యి అడ్డం పెట్టి లక్ష్మమ్మగారు "మీ కాళ్లు పట్టుకుంటాను. దయచేసి ఇక మాట్లాడకండి" అంది సజల నయనాలతో.

సమయం ఆరు అవుతోంది.

శ్రీరామ రామ రామేతి రమే రామే మనో రమే... సహస్రనామ తత్తుల్యం రామ నామ వరాననే... జపం చేసుకుంటున్నారు. అందరూ కనులు మూసుకుని భగవన్నామస్మరణ చేసుకుంటున్నారు.

"లక్ష్మీ... లక్ష్మీ.... ఒరేయ్ మీ అమ్మను చూడండిరా"... అనే తండ్రికేక విని అందరూ కళ్లు తెరిచారు.

శ్రీరామమూర్తిగారి పాదాల దగ్గర జీవం లేని లక్ష్మమ్మగార్ని చూసి అందరూ గొల్లుమన్నారు.

శ్రీరామమూర్తి గారికి కళ్లల్లో నీరు చేరటం వల్ల ఎదురుగావున్న శ్రీరామచంద్రమూర్తి పటంలో క్షణంసేపు సీతమ్మతల్లి కనిపించలేదు. ●



యువ కవి యన్.వి. రఘువీర్ ప్రతాప్‌కు "జాతీయ కళాలయ విశిష్ట పురస్కారం" అందజేస్తున్న ప.గో.జిల్లా పాలకొల్లు కళాలయ సంస్థ అధ్యక్షులు కాగిత సూర్యనారాయణ, సినీ దర్శకులు ఆకుల రాఘవ, శ్రీ బి.వి.రాధారమణ గుప్త.